www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 7 ఏప్రిల్ 2025

5

కాకినాడ

బహిరంగ సభలో సిపిఎం జిల్లా శ్రేణులు

ప్రజాశక్తి - సామర్లకోట

సిపిఎం 24వ జాతీయ మహాసభల బహిరంగ సభలో పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు చెందిన సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో వండియార్ మైదానంలో ఆదివారం జరిగిన సిపిఎం బహిరంగ సభలో పాల్గొన్న సిపిఎం శ్రేణులు నినాదాలతో హోరెత్తారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.క్రాంతికుమార్, టి.రాజా, యాసలపు రమేష్, కార్యకర్తలు బాలం హరిబాబు, బాలం సత్తిబాబు, రొంగల అరుణ్‌కుమార్, పీడీ ప్రసాద్, జె.జగదీష్ పాల్గొన్నారు.

బహిరంగ సభ వద్ద నినదిస్తున్న సిపిఎం శ్రేణులు

వేసవి అలవెన్స్ ఏదీ.?

- మండుటెండల్లో 'ఉపాధి' పనులు
- గతంలో 30 శాతం అదనపు వేతనం
- నాలుగేళ్ళుగా నిలిపివేసిన పాలకులు
- కూటమి సర్కారుపై కూలీల ఆశలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నానాటికి నిర్వీర్యం అవుతుంది. ఇప్పటికే పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడం లేదు. టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్లు, తాగునీరు, ఒఆర్‌ఎస్, మజ్జిగ వంటి వంటివి గతంలో అందజేసేవారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం వీటి మాటే మరిచిపోయింది. అలాగే వేసవిలో 5 నెలల పాటు ఉపాధి కూలీలకు వేసవి భత్యం ఇచ్చేవారు. అది కూడా కోత విధించారు. కూటమి ప్రభుత్వం స్పందించి సమ్మర్ అలవెన్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 4.48 లక్షల మంది కూలీలున్నారు. వీరిలో రెగ్యులర్‌గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగిన టిసిఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న ఆప్షన్‌ను కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం తీసుకొచ్చిన ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లో చేసిన పలు మార్పులు కూలీల పాలిట శాపాలుగా మారాయి. కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి అలవెన్స్‌లను రద్దు చేశారు. దీంతో కూలీలు మండుటెండల్లో పనులు చేసేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

ఉపాధి పనులు చేసే వారికి గతంలో అదనపు వేతనం వచ్చేది. ఐదు నెలలపాటు అందరికీ 20 నుంచి 30 శాతం అదనంగా అలవెన్స్ ఇచ్చేవారు. గత ప్రభుత్వ హయాంలో దీనిని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే వేసవి బత్యాన్ని పునరుద్ధరించాలి.

-దువ్వాల కృష్ణ, ఉపాధి కూలీ, వెల్దుర్తి, పిఠాపురం మండలం

శ్రమకు తగ్గ వేతనం లేదు

ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా కష్టపడినా కనీస కూలీ రూ.250 మించి రావడం లేదు. శ్రమకు తగ్గ ఫలితం ఉండటం లేదు. కేంద్రం తమ నిర్ణయం మార్చుకుని సమ్మర్ అలవెన్స్ సొమ్ములను అందజేయాలి. అలాగే సౌకర్యాలు కల్పించాలి. మండుటెండల్లో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

-దుప్పి అదృష్టదీపుడు, కూలీ, సీతారాంపురం, తాళ్ళరేవు మండలం

ఏడాదిలో 5 నెలలు అలవెన్స్‌లు

గతంలో సమ్మర్ అలవెన్సుగా ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 2 శాతం చొప్పున చెల్లించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అలాగే వేసవిలో తాగునీటి కోసం ఒక్కో కూలీకు రూ.5, తట్ట, పారకు రూ.5 ఇచ్చేవారు. ఇవి కూడా నిలిపివేశారు. ఈ వేసవిలో 38 నుంచి 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో ఉపాధి హామీ పనులకు హాజరు తక్కువగా ఉంటోంది. మార్చి నుంచి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు నేపథ్యంలో కూలీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ అలవెన్స్‌లను ఇచ్చేది. అయితే సాఫ్ట్‌వేర్ మార్పుతో వేతనం తప్ప ఇతర భత్యాలు ఏవీ ఇవ్వడం లేదు. దీంతో కూలీలంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వీర్యం చేసే కుట్ర

ఉపాధి పథకంలో గతంలో కూలీలకు పలు సౌకర్యాలు అందేవి. అయితే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. దానిలో భాగంగానే పని ప్రదేశంలో సౌకర్యాలను కల్పించే ఊసే ఎత్తడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బిజెపితో పూర్తిస్థాయి సంబంధాలు కొనసాగిస్తున్న తరుణంలో తిరిగి వేసవి భత్యం ఇచ్చే విధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కూలీలు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజబాబు

కౌలు రైతుకు మేలు చేసే చట్టం అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కౌలు రైతుల గుర్తింపు కార్డు (సిసిఆర్‌సి) చట్టాన్ని రద్దుచేసి కౌలు రైతులకు మేలు చేసే కొత్త చట్టం అవసరమని ఎపి కౌలు రైతుల సంఘం స్పష్టం చేసింది. ఆదివారం ప్రజా సంఘాల భవనంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం చల్ల సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. 2011 సంవత్సరంలో సిపిఎం, రైతు సంఘం పోరాట ఫలితంగా ఎల్ఇసి కార్డు ఇచ్చారని, 2019లో ఎల్ఇసి చట్టాన్ని రద్దుచేసి సిసిఆర్‌సి చట్టాన్ని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాన్ని రద్దు చేసి కౌలు రౌతుకు మేలు చేసే చట్టాన్ని తీసుకొస్తామని చెప్పిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఆ దిశగా అడుగులు వేయడం లేదన్నారు. సిసిఆర్‌సి చట్టాన్ని రద్దు చేయకపోవడం వల్ల అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అందని పరిస్థితి నెలకొందన్నారు. కౌలు రైతుకు ఈ పథకం వర్తింప చేయరాదనే రీతిలో కూటమి ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావడం లేదనే అనుమానాన్ని వ్యక్తం చేశాఉరు. కౌలు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధితో కొత్త చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో శివారు భూములకు సాగునీరు అందించేందుకు శాశ్వత పరిష్కారం చూడాలని, మురుగు కాలవలకు మరమ్మతులు, వంతెనలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పాలెపు ఈశ్వరరావు, దడాల వెంకటేశ్వరరావు, పిల్లి నాని, పంచగళ్ళ రామకృష్ణ, మేడిశెట్టి కొండ, పి.వాడపల్లి, ఎం.సాయి నాగేంద్ర, అడపా జాను, వి.సత్తిబాబు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరంకు చెందిన రాము శ్రీను తన కుమార్తె భువనేశ్వరి పుట్టినరోజు పురస్కరించుకుని ధర్మవరం గ్రామానికి చెందిన కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయాన్ని అందించారు. రాము శ్రీను ఇప్పటికే 40 సార్లు రక్తదానం చేసి పలువురి మన్ననలను పొందారు. గత కొంతకాలంగా ధర్మవరంకు చెందిన యువతి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ దాతల సహాయం కోసం ఎదురు చూస్తుందని తెలిసిన శ్రీను తన కుటుంబ సభ్యులతో వెళ్లి ఆమెకు పాలు, పండ్లు, కొంత నగదును అందజేశారు. బాధిత యువతకి మంచి వైద్యం అందించాలని, నెల రోజులు పాటు వైద్యానికి అయ్యే ఖర్చు తాను బరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనుతోపాటు కుమార్తె కీర్తన, కుమారుడు కార్తీక్‌సాయి, ఎండి అధికార్, పంపన సూరిబాబు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం అందిస్తున్న రాము కుటుంబం

ఎన్‌టిఆర్ సేవలు మరువ లేనివి

ప్రజాశక్తి - పెద్దాపురం

అట్టడుగు, వెనుకబడిన వర్గాల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి నందమూరి తారక రామారావు చేసిన సేవలు మరువలేనివని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప అన్నారు. ఆదివారం మండలంలోని కట్టమూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎలిశెట్టి నాని, ఏలేటి సుబ్బారావు, గుత్తుల సూర్యావతి, శ్రీనివాస్, ఎస్.రామకృష్ణ, నంది ఉమామహేశ్వరి, చిక్కాల సాయి, పెట్లు వీరభద్రరావు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

సిసి రోడ్డు వేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి - గండేపల్లి

సిసి రోడ్డు వేయాలంటూ మండలంలోని నీలాద్రిరావుపేట జాతీయ రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. తమ గృహాలకు వెళ్లే రహదారిలో సిసి రోడ్ వేస్తానని బాగున్న రోడ్డుని ఛిద్రం చేశారని, గత 20 రోజులుగా గోతుల్లోంచి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిసి రోడ్డును వేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో జాతీయ రహదారిపై భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు, జగ్గంపేట ఎస్ఐ రఘునాథ్‌బాబు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించారు. త్వరితగతిన రోడ్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు తమ ఆందోళనను విరమించారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

ప్రవీణ్ మృతికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, దళితులు

ప్రవీణ్ మృతి క్రైస్తవులు శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - రౌతులపూడి

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా క్రైస్తవ సమాజం శాంతి ర్యాలీ నిర్వహించింది. ఆదివారం రౌతులపూడిలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన శాంతి ర్యాలీలో క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకుని ప్రవీణ్ మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, కుల, మతాలకు అతీతంగా ఆయన మృతిని ఖండించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ సామ్యూల్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఆయన మరణానికి గల కారణాలను క్రైస్తవ సమాజానికి తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, బోధకులు, క్రైస్తవులు, దళితులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్‌టిసి కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అక్రమంగా సస్పెండ్ చేసిన డ్రైవర్ ఎస్‌వి.రమణను విధుల్లో తీసుకోవాలని, డిపోలో నెలకున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 44వ రోజుకు చేరింది. కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ భోజన విరామ సమయంలో గేటు ధర్నాలు చేపడుతున్నారు. డిపో వద్ద కొందరు కార్మికులు రిలే నిరహరదీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ 1/2019 సర్కులర్ ప్రకారం సస్పెండ్ చేసే అధికారం లేదన్నారు. కార్మికులు గత 44 రోజులుగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు. తుని, కాకినాడ డిపోల్లోనూ రిలే నిరాహార దీక్షలు, గేటు ధర్నాలు జరుగుతున్నాయని అన్నారు. జోన్ పరిధిలోని అన్ని డిపోల్లో కార్మిక సంఘాలు ఒక తాటిపైకి వచ్చి అక్రమంగా సస్పెండ్ చేసిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, వివిధ డిపోలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యుబిఎం.కుమార్, యునైటెడ్ యూనియన్ కార్యదర్శి ఎన్‌పి.రావు, కార్మికులు పాల్గొన్నారు.

డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ లక్ష్మి మాట్లాడుతూ దాతల సాయంతో అన్నదానాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ ఆసాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆలయం వద్ద నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు.

అన్నదానాన్ని పర్యవేక్షిస్తున్న ఆలయ ఎసి

ఎంపీకి పలువురి అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నెలకున్న సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను పలువురు ప్రశంశించారు. ఆదివారం జిజిహెచ్ ఐఎన్‌టియుసి యూనియన్ ప్రెసిడెంట్ గూడుపు రవణమ్మ, సెక్రెటరీ సింగంపల్లి శ్రీనివాస్ తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పిఎంఎస్‌ఎస్‌వైలో కాకినాడ జిజిహెచ్‌ను చేర్చి అభివృద్ధి చేసేందుకు చట్టసభలో బిల్లును ఆమోదించాలని కోరడాన్ని వారు అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ ట్రెజరర్ గొర్ల నారాయణరావు, వైస్ ప్రెసిడెంట్ చెన్నా మహేష్, డి.అమ్ములు, రావులమ్మ, మేరీ, నిర్మల, వరలక్ష్మి, మధు, మురళి పాల్గొన్నారు.

ఎంపీని అభినందిస్తున్న యూనియన్ నాయకులు

నేటి నుంచి వల్లభ స్వామి కల్యాణ వేడుక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి కల్యాణ వేడుకలు ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిసి రమేష్‌బాబు పాల్గొంటారన్నారు. కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గత నెల 28న ప్రారంభమైన ఈ జాతర 45 రోజులపాటు కొనసాగుతుంది. ఆదివారం కావడంతో జాతరకు పెద్దఎత్తున యాత్రికులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థలు తమ సేవా కార్యక్రమాలను అందించాయి. ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పిఠాపురం

విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇఇ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి పిఠాపురం సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కెవి ఫీడర్‌పై గల పిఠాపురం పట్టణం, కొలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగాపురం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

30 లోపు పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేటు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 30వ తేదీలోపు ఆస్తి పన్నులను చెల్లిస్తే 5 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2025-26 ఏడాదికి సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి పన్నులను ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే 5 శాతం రిబేటు ఇస్తున్నట్లు తెలిపారు.కావున ఐదు శాతం పన్ను తగ్గింపు కొరకు పన్ను చెల్లింపులు చేయవచ్చన్నారు. ప్రజలకు డిమాండ్ నోటీసులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇంటి పన్ను నంబరు లేదా డోర్ నెంబర్‌తో పన్ను చెల్లింపు కేంద్రానికి వచ్చినా గాని పన్ను చెల్లింపు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

పూర్తికాలం లైబ్రేరియన్‌ను నియమించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజలకు విజ్ఞానాన్ని అందివ్వడానికి 1967లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరిట ప్రారంభించిన గ్రంథాలయానికి పూర్తికాలం లైబ్రేరియన్‌ను నియమించాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ రెడ్డి గిరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు ఆయన లేఖను రాశారు. 1967 ప్రారంభించిన గ్రంథాలయానికి అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు 1987లో గ్రామ పంచాయతీ కేటాయించిన 4 సెంట్లు స్థలంలో పక్కా భవనం నిర్మించారని తెలిపారు. 2009లో నాటి ఎంపి జివి.హర్షకుమార్ ఇచ్చిన నిధులతో మొదటి అంతస్తు నిర్మించారని గుర్తు చేశారు. గ్రంథాలయానికి ఒఎన్‌జిసి రూ.3 లక్షల విలువైన పుస్తకాలు, పరికరాలను అందించిందని తెలిపారు. 1987 నుంచి 2018 వరకు ఈ గ్రంథాలయం పూర్తి కాలం లైబ్రేరియనతో సక్రమంగా నడిచిందన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకూ పూర్తి కాలం లైబ్రేరియన్ లేక గ్రంథాలయ సేవలు పాఠకులకు సక్రమంగా అందడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి పూర్తికాలం లైబ్రేరియన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఈనెల 8వ తేదీ నుంచి 13 తేదీ వరకు కాకినాడ బీచ్ రోడ్‌లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు రూరల్ సిఐ చైతన్యకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా, అమెరికా సైనిక దళాల విన్యాసాల నేపథ్యంలో బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ పూర్తిగా నిషేధించి రూటు మళ్లించడం జరిగిందని తెలిపారు. 7వ తేదీ రాత్రి 10 నుంచి 13వ తేదీ ఉదయం 6 గంటల వరకు కాకినాడ లైట్ హౌస్ సెంటర్ నుంచి ఉప్పాడ సెంటర్ వరకు బీచ్ రోడ్లో ప్రయాణించే వాహనాలకు రూట్ మళ్లించడం జరిగిందన్నారు. అందువల్ల బీచ్ రోడ్లో ప్రయాణించేవారు పైన తెలిపిన తేదీలలో మరొక మార్గంలో వెళ్లాలని సూచించారు. బీచ్ పరిసర గ్రామాలైన సూర్యారావుపేట, పర్రకలువ, పోలవరం, జగన్మోహనపురం, నేమం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు బీచ్ ప్రవేశం నిషేధించడం జరిగిందని తెలిపారు.

వైసిపికి జాన్ మోజెస్ రాజీనామా

ప్రజాశక్తి - సామర్లకోట

తన వ్యక్తిగత కారణాలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మైలాబత్తుల జాన్ మోజెస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెద్దాపురం నియోజక వర్గం వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, పట్టణ వైసిపి అధ్యక్షులు పాగా సురేష్‌కుమార్‌కు ఆయన రాజీనామా లేఖను వాట్‌సాప్ ద్వారా పంపినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'

ఘనంగా శ్రీరామ నవమి వేడుక

ప్రజాశక్తి - యంత్రాంగం

శంఖవరం అన్నవరం దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులకు దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్‌చ, ఇఒ వీర్ల సుబ్బారావు దంపతులు దేవస్థానం తరుపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు అర్చకులు సీతారాముల వారికి సంప్రదాయ రీతిలో కళ్యాణం తంతు నిర్వహించారు ఈ సందర్భంగా యాత్రికులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. **గండేపల్లి** మండలంలోని వెలమపేట రామాలయంలో జరిగిన వేడుకలో ఎంఎల్ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు. నాయకులు యలమటి కాశి, వెంపటి రాజు, సుంకువల్లి రమేష్, ఇపేర్ల సురేష్ పాల్గొన్నారు. గండేపల్లి రామాలయంలో ఎస్ఐ శివనాగబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. **పెద్దాపురం** స్థానిక మహారాణి సత్రంలో సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్‌శ్రీనివాస్, విశాలాక్షి దంపతులు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, బొడ్డు ఉదయ్, జనసేన పట్టణ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



అన్నవరంలో పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఇఒ, ఛైర్మన్

గండేపల్లిలో పూజల్లో పాల్గొన్న ఎంఎల్ఎ జ్యోతుల

రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి సత్యనారాయణ

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తడిసిన ధాన్యానికి ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ సూచించారు. గత రెండు రోజులుగా దఫదఫాలుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని చేబ్రోలు, మల్లవరం గ్రామాల్లో కోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండకి ఆరబెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సంబంధిత గ్రామాలను వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. మండలంలో ఏడు రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

డ్రోన్‌ను చూసి పరారవుతున్న నిందితుడు

డ్రోన్ సాయం పేకాడుతున్న వారు అరెస్ట్

ప్రజాశక్తి-పెరవలి

డ్రోన్ సాయంతో పేకాడుతున్న వారిని అరెస్ట్ చేశారు పోలీసులు. వివరాలు ఇవి.. మండలంలోని కాపవరంలో పంట పొలాల మధ్య మామిడి చెట్ల కింద పేకాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ యం. వెంకటేశ్వరరావు తమ సిబ్బంది సాయంతో అక్కడికి వెళ్లి అక్కడ నుంచి డ్రోన్ ఎగురవేశారు. పేకాడుతున్న వారు ఎటువైపు వెళ్తున్నారో గుర్తించి వారిని పట్టుకుని వారి వద్ద నుంచి నగదు రూ.4,010 స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు

కె.గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల సీజ్

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని బట్లపాలిక, దొరువుపేట ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. తమకు అందిన సమాచారం బట్టి శనివారం సాయంత్రం వాటిని పట్టుకున్నామన్నారు. ఇసుకను పోలీస్ స్టేషన్ వద్ద డంప్ చేయించి, టాక్టర్లను సీజ్ చేసి ఏ గంగవరం తహశీల్దార్ కార్యాలయం అప్పగించామన్నారు. దీనిపై విచారం చెప్పి తహశీల్దార్ ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధిస్తారని ఎస్ఐ వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం రాజుగారి గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం వేమగిరి సునీల్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీతానగరం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సునీల్ రాజుగారి గార్డెన్ రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఫంక్షన్ హాలు నిర్వాహకులు సునీల్ మతదేహాన్ని సీతానగరంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సంఘటనపై సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ ప్రకాష్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి - అంబాజీపేట

చిన సత్యనారాయణ(ఫైల్)

ప్రజాశక్తి దిన పత్రిక కొత్తపేట డివిజన్ ఆర్గనైజర్ కొత్తపల్లి ప్రకాష్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి కొత్తపల్లి చిన సత్యనారాయణ (62) అమలాపురంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. పలువురు నాయకులు, మిత్రులు, పాత్రికేయులు ప్రకాష్‌ను పరామర్శించారు. ఆయన మృతికి ప్రజాశక్తి దినపత్రిక రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, డెస్క్ ఇన్‌ఛార్జి ఎస్.విశ్వనాథ్, సమన్వయ కమిటీ సభ్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సత్యనారాయణ అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు పరామర్శ

పితృ వియోగంతో బాధ పడుతున్న ప్రకాష్‌ను సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పరామర్శించారు. ప్రకాష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన సత్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రారంభానికి నోచుకోని సులభ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - కోటనందూరు

కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన కోటనందూరులో గత ప్రభుత్వంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ ప్రారంభనానికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటనందూరు, కాకరాపల్లి జంట గ్రామాలుగా ఉన్న ప్రధాన కూడలిలో ఆర్‌టిసి బస్సు షెల్టర్ ఉంది. ఆర్‌టిసి ప్రయాణికులకు, బాటసారులకు విద్యార్థులకు ద్విచక్ర వాహనదారులకు టాయిలెట్స్ లేకపోవడంతో వారి ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వంలో మండల పరిషత్ అభివృద్ధి నిధులతో మండల పరిషత్ అధ్యక్షుడు లగుడి శ్రీనివాస్ సుమారు రూ.6 లక్షల నిధులు వెచ్చించి సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇప్పటికన్నా ఉన్నతాధికారులు స్పందించి సులభ్ కాంప్లెక్స్ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

కోటనందూరులో ప్రారంభం కాని సులభ్ కాంప్లెక్స్

తోటల పెంపకంలో జిల్లాకు ప్రథమ స్థానం

డ్వామా పీడి ఎ. నాగమహేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తోటల పెంపకంలో జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని దినాలు 11,754 కుటుంబా లకు కల్పించి లేబర్ బడ్జెట్ 102.07 శాతంతో రాష్ట్రంలో 06వ స్థానంలో తూర్పు గోదావరి జిల్లా నిలిచిందని డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు తెలిపారు.

జిల్లాలో ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని 1,00,247 కుటుంబాలలోని 1,32,954 మంది ఉపాధి హామీ కూలీలకు 51,88,790 పని దినాలు కల్పించాము. తద్వారా ఉపాధి హామీ కూలీలకు రూ.131 కోట్ల మేర వేతనాల రూపంలో చెల్లించాము. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద ఎస్‌సి కుటుంబాలకు 18.67 లక్షల పని దినాలు, ఎస్‌సి కుటుంబాలకు 1.02 లక్షల పని దినాలను కల్పించాము. ఒక్కొక్క పని దినానికి సగటున రోజువారీ వేతనం రూ.255 చొప్పున చెల్లించాము. ప్రస్తుతం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సగటు దినసరి వేతనం రూ.290 నుంచి రూ.300 పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.

జిల్లాకు వివిధ కేటగిరీలలో వచ్చిన స్థానం ఏమిటి..

జిల్లాలో 149.50 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను రూ.72 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశాము. సిమెంట్ రోడ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అదే విధంగా పాడి రైతులకు సంబంధించి 583 పశువుల షెడ్లను రూ.09.85 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేయించాము. పశువుల షెడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో 07వ స్థానం లభించింది. జిల్లాలోని 373 మంది సన్న, చిన్న కారు రైతులకు 643.50 ఎకరాలలో రూ.87.90 లక్షల వ్యయంతో పండ్ల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాము. పండ్ల తోటల పెంపకంలో రాష్ట్రంలోనే తూర్పు గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

2025-26లో కార్యాచరణ ప్రణాళిక ఏమిటి..

2025-26 ఆర్థిక సంవత్సరం కార్యాచరణలో భాగంగా పంచ ప్రాధాన్యాలు ఇచ్చాము. మొదటిగా పని దినాల కల్పన, రూ.300 వేతనం, ఏప్రియల్, మే, జూన్ నెలలో తూర్పు గోదావరి జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు 35 లక్షల పని దినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి పని దినానికీ సగటు వేతనం రూ.300 పొందే విధంగా మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతలపై అవగాహన కల్పించాము.

నీటి తొట్టెలు, ఫారం పాండ్ల నిర్మాణంపై చర్యలు ఏమిటి..

వేసవిలో పశువులకు నీటి సదుపాయం కల్పించేందుకు జిల్లాలో పశు సంవర్ధక శాఖ గుర్తించిన 157 ప్రదేశాల్లో ఒక్కొక్కటీ రూ.33,000తో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టేందుకు నిర్ణయించాము. ఈ పశువుల నీటి తొట్టెలను ఏప్రియల్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నాము. జిల్లాలోని సన్న, చిన్న కారు రైతుల పొలాల్లో 1500 ఫారం పాండ్లు (సాగునీటి నీటికుంటలు)లు ఉపాధి హామీ నిధులతో చేపట్టేకుందుకు లక్ష్యం నిర్ధేశించాము. ఈ ఫారం పాండ్ల నిర్మాణం ద్వారా రైతులకు నీటి లభ్యత మెరుగుపడుతుంది. రానున్న మూడు నెలల కాలంలో 1500 సాగునీటి చెరువులు పూర్తి చేసేందుకు జిల్లాలోని 9 మండలాలకు లక్ష్యాలను నిర్ధేశించాము.

పంటకాలువలు, చెరువుల పూడిక పనులపై లక్ష్యాలు ఏమిటి..

జిల్లాల్లోని డెల్టా మండలములకు సంబంధించిన పంట కాలువలు, మైనర్ మరియు మేజర్ కాలువలో పూడికతీయుటను ఈ మూడు నెలల కాలములో జిల్లాలోని 2500 కిలోమీటర్ల పంటకాలువలో పూడిక తీయుటకు లక్ష్యంగా నిర్ధేశించుకున్నాము. దాళ్వా వరి పంట కోతలు పూర్తి కాగానే పూడిక తీత పనులు ప్రారంభించి, కాలువలకు నీరు వదిలే సమయానికి పూర్తి చేస్తాము. ఈ మూడు నెలల కాలంలో అన్ని మండలాల్లోనూ కలిపి 392 చెరువులలో పూడిక తీసేందుకు ఇప్పటికే పరిపాలన ఆమోదం మంజూరు చేశాము. జూన్ నెలలో వర్షాలు పడే నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసే విధంగా లక్ష్యాలను నిర్ధేశించుకున్నాము. ఏప్రిల్, మే, జూన్‌లలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని అన్ని మండలాల్లోని ఉపాధి హామీ సిబ్బందిని సమాయాత్తం చేశాము. లక్ష్యం మేరకు ఈ పనులను పూర్తి చేయడం ద్వారా జిల్లాలో ఉపాధీ హామీ వేతనదారులకు పని కల్పిస్తున్నాము.

శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక ఏమిటి..

జిల్లాలోని శ్మశానవాటికలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యతా కార్యక్రమంగా చేపట్టేందుకు అక్టోబర్ 2024 లో ప్రతిపాదనలు పంపాము. 2025-26 ఆర్థిక సంవత్సరం శ్మశాన వాటికలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వారి నుంచి అనుమతి లభించింది. మండలానికి మూడు చొప్పన ప్రతిపాదనలు వచ్చినవి. ఈ పనులను ఒకొక్క శ్మశాన వాటికకు సుమారు రూ.15.00 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నాము.

పిహెచ్‌సిలో సమస్యల నిలయం

-ఉపయోగం లేని ఆపరేషన్ థియేటర్

-మూలన పడ్డ పరికరాలు

ప్రజాశక్తి - కరప

కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి) సమస్యలకు నిలయంగా మారింది. ఈ పిహెచ్‌సికి గతమెంతో ఘన చరిత్ర ఉన్నా నేడు కనీస సౌకర్యాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. శిథిలావస్థలో ఉన్న భవనం స్థానే నూతన భవనం నిర్మించేందుకు 2017లో నాటి ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి రూ.118 లక్షలతో 2018లో నూతన భవనాన్ని నిర్మించారు. అయితే వైద్య సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. 3 నెలల క్రితం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ వేళంగి పిహెచ్‌సికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ బి.ఏంజలీనా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆమె జూనియర్ డాక్టర్ కావడంతో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పిహెచ్‌సికి ప్రతీ రోజు వందకు పైగా ఔట్ పేషెంట్స్ వస్తున్నారు. వీరికి అదనంగా గర్భిణులు పెద్ద సంఖ్యలోనే వైద్య సేవల నిమిత్తం వస్తున్నారు. జనవరి నెలలో 52 మంది గర్భిణులు వైద్య సేవలకు రాగా, వీరిలో 20 మంది నిత్యం డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాల్సిన వారు వచ్చారు. ఫిబ్రవరి 44 మంది రాగా, వీరిలో 17 మందికి అత్యవసర సేవలు అవసరం అయ్యాయి. ఇక మార్చి నెలలో 44 ఆసుపత్రికి రాగా, వీరిలో 16కి అత్యవసర వైద్య సేవల కోసం వచ్చారు. అయితే ఇక్కడ సీనియర్ గైనకాలజిస్టు లేకపోవడంతో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చిన వారు కాకినాడ జిజిహెచ్‌కు, ఇతర ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందారు. వైద్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పిహెచ్‌సి నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. ఆసుపత్రిలో డెలివరీ కేసులు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ఇక్కడ నోచుకోవడం లేదు.

మూలన పడ్డ పరికరాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ పిహెచ్‌సిని సందర్శించి సమస్యలను గుర్తించారు. సమస్యల పరిష్కారం కోసం ఒక నివేదికను రూపొందించి ఎంఎల్‌ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్‌ఎ స్పందించి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సిఎస్ఆర్ నిధుల నుంచి ఆసుపత్రి అభివృద్ధికి సుమారు రూ.46 లక్షల విలువ చేసే పరికరాలను ఆసుపత్రికి సమకూర్చారు. అయితే ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలు వచ్చినా వాటిని వినియోగించేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో ఆ పరికరాలు గత 3 నెలలుగా మూలన పడ్డాయి.

అన్న క్యాంటీన్లలో చాలీచాలని భోజనం

- అన్నం కావాలంటే మరో రూ.5 చెల్లించాలి
- అమలు కాని మెనూ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పేదవాడి ఆకలి తీర్చేందుకు నడుం బిగించిన టిడిని ప్రభుత్వం అన్న క్యాంటీన్ల పేరుతో రూ.5లకు భోజనం పథకాన్ని ప్రవేశపెట్టింది. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి పార్టీ నాయకులతో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. దీంతోపాటుగా క్యాంటీన్ల వద్ద మెనూ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది ఇక ఆచరణ లోనికి వస్తే ఇక్కడ మెనూలో కూర, పప్పు, పచ్చడి, సాంబారు, పెరుగు వడ్డించాల్సి ఉంది. రోజుకు పగలు 400 మంది రాత్రి 200 మందికి భోజనాలు అన్న క్యాంటీన్లో

పట్టణంలో ఏర్పాటు చేసినఅన్న క్యాంటీన్ ఇదే


మెనూ చార్ట్

అందజేస్తున్నారు. అయితే ఇక్కడ వడ్డించేది మాత్రం చాలీ చాలని అన్నం, ఒక కూర, కొంచెం సాంబారు, మజ్జి గతో సరిపెడు తున్నారు. ఇది ఎవరికీ సరిపోవడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ఈనెల5న అన్న క్యాంటీన్లో మెనూ ఆహార పదార్థాలను పరిశీలించింది. ఒక కప్పుతో వెలితిగా అన్నం వడ్డించి కొంచెం కూర కొంచెం సాంబార్ తో సరిపెడుతున్నారు. కొందరు మహిళలు మళ్లీ అన్నం కావాలని అడగ్గా మరో రూ.5 చెల్లించి అన్నం పెట్టించుకోవాలని నిర్వా హకులు సూచిస్తున్నారు. పేదలు మళ్లీ అన్నం కోసం మరో రూ.5 చెల్లిస్తు న్నారు. ఇక రిక్షా కార్మి కులు, వ్యవసాయదారులు అయితే మూడుసార్లు రూ.5 చొప్పున చెల్లించి ఆహారం తీసుకుంటే గాని సరిపోని పరిస్థితి నెలకొంది. రామచంద్రపురం అన్న క్యాంటీన్లో ఏర్పాటుచేసిన నోడల్ అధికారి శివను దీనిపై వివరణ కోరగా ప్రభుత్వం అందజేసిన గైడెన్స్ ప్రకారం అన్నం పెడుతున్నామని ఇది సరిపడగా ఉన్నప్పుడు ఆదనంగా మరో రూ.5 చెల్లించి వినియోగదారులు ఆహారం తీసుకుంటున్నారని దీనిని పై

భోజనం చేస్తున్న యువకులు

అధికారుల దష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అదే విధంగా మెనూ లో ఐదు రకాలు పెట్టవలసి ఉండగా కేవలం మూడు రకాల వడ్డిస్తున్నారు అన్న విషయాన్ని కూడా ఈయన పై అధికారుల దష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ప్రభుత్వం అట్టహాసంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో సరిపడా అన్నం పెట్టి పేదల కడుపు నింపాలని, కూరలు సాంబారు సరిపడగా వేయాలని, అరకొర ఆకలి కాకుండా పూర్తిగా ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పార్టీ నాయకులు చర్యలు చేపట్టాలని అదనపు అన్నానికి మరో అయిదు చెల్లించకుండా చర్యలు చేపట్టాలని అన్న క్యాంటీన్లో భోజనానికి వచ్చిన పలువురు కోరుతున్నారు. పేదల కడుపులు నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని చిత్త శుద్ధితో కొనసాగించి పేదలకు మరింత రుచికరమైన భోజనం అందించాలని అప్పుడే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

చింతలూరులో ట్రాఫిక్ జామ్

మూడు గంటల పాటు యాత్రికులకు అవస్థ

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులో వేంచేసియున్న శ్రీనూకాంబిక అమ్మవారి తీర్థానికి వచ్చిన యాత్రికులతో పాటు భారీ వాహనాల రాకపోకల వల్ల విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో పాటు బారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించడంతో కొత్తూరు నుంచి వెదురుమూడి రోడ్డులో రెండు కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు ట్రాఫిక్ స్థంభించి పోయింది. దీనివల్ల చంటిపిల్లల తల్లులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సుమారు మూడు గంటల పాటు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ దుస్థితిపై స్పందించవలసిన దేవాదాయశాఖ, పోలీసుశాఖ ఆలస్యంగా స్పందించడంతో ప్రయాణికులే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికలు వాహనాలను ఒక పద్ధతి ప్రకారం కాకుండా రోడ్డుకు ఇరువైపుల ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ఈట్రాఫిక్ సమస్యకు కారణమైంది. చింతలూరు తీర్థంలోని ఏర్పాట్లను కేవలం మూడు రోజులకే పరిమితం చేసి అనంతరం భక్తుల సౌకర్యాల కల్పనను అధికారులు గాలికి వదిలే యడంతో ప్రతియేటా ఈపరిస్థితి సంభవిస్తుందని యాత్రికులు ఆరోపిస్తున్నారు. శ్రీనూకాంబిక అమ్మవారి తీర్థానికి సంబ్యంధించి యాత్రికులు నెల రోజుల పాటు ప్రతి ఆది, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారని అధికారులకు తెలిసినా నిర్లక్ష్య ధోరణితో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులు పట్ల దేవదాయశాఖ పర్యవేక్షణలో ఇతర శాఖల అధికారులు నిర్వహిస్తున్న విధుల నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ జామ్ సమస్యపై పోలీసు స్టేషన్‌కు వినతులు వెల్లువెత్తడంతో ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ నేతృత్వంలో సిబ్బంది వచ్చి కొద్ది సమయం తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చింతలూరు నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

మెజీషియన్ ఆలీకి ఘన సన్మానం

ప్రజాశక్తి - మామిడికుదురు

కళారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మామిడికుదురు మండలం నగరానికికు చెందిన ప్రముఖ మెజీషియన్ ఆలీకి హైదరాబాద్ లో ఉగాది పురస్కారం -2025 సంగమం ఫౌండేషన్ తరపున ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్ కిషోర్, ప్రముఖ సినీ నటి వై.విజయ, నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు రేలంగి నరసింహారావుకలసి మెజీషియన్ ఆలీకి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు సాంస్కృతిక, కళారంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఫౌండేషన్ తరపున అధ్యక్షులు సంజయ్ కిషోర్ మాట్లాడుతూ సాంస్కృతిక, సినీ, కళారంగ అభివృద్ధికి తోడ్పడే వారిని గుర్తించి సత్కరించడం మా ధ్యేయమని అన్నారు.

ఉగాది పురస్కారం అందుకుంటున్న మెజిషియన్ ఆలీ

మెజిషియన్ ఆలీ మాయాజాల ప్రదర్శన, ప్రత్యేక మ్యాజిక్ షో ప్రేక్షకులను అబ్బురపరిచింది. అతని వినూత్న సాంకేతికత, ఫింగర్ మ్యాజిక్, కార్డ్ మానిపులేషన్ లాంటి కళాత్మక ప్రదర్శనలు సభికులను అలరించాయి.

శ్మశాన అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

దాతను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మండలంలోని పెంకేవారి పేట శ్మశాన వాటిక అభివృద్ధికి డైమండ్ గ్రూప్, లయన్స్ క్లబ్ సభ్యుడు పబ్బినీడి వెంకటరత్నకుమార్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ కైలాస భూమిగా అభివృద్ధి చేస్తున్న విషయం విధితమే. దీనిలోభాగంగా శ్మశానంలో రెండు దహన బెడ్లు నిర్మించేందుకు ఈ నిధులను వినియోగించాలని దాత తెలిపారు. విరాళాన్ని లయన్స్ క్లబ్ నిర్వాహకులు పొన్నాడ పేరయ్యరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నడింపల్లి వినోద్‌లకు అందించారు. ఈ సందర్భంగా కుమార్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు.

లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంఎల్‌సి రవీంద్రబాబు, ఎంఎల్‌ఎ ఆనందరావు

లబ్ధిదారులకు పేపర్ ప్లేట్ యంత్రం అందజేత

రూ.లక్ష విరాళం అందజేసిన ఎంఎల్‌సి రవీంద్రబాబు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎంఎల్‌సి డాక్టర్ పండుల రవీంద్ర బాబు రూ.లక్ష విరాళంతో పేపర్ ప్లేట్ యంత్రం సమకూర్చారు. ఈ యంత్రాన్ని మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ తరపున ఆదివారం అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామంలో ఎంఎల్‌సి పండుల రవీంద్రబాబు, అమలాపురం ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యమంతుల రజిని అధ్యక్షతన పేపర్ ప్లేట్ యంత్రంను లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆనందరావు మాట్లాడుతూ మహిళలందరూ స్వయం ఉపాధి ద్వారా ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి మహిళ పొదుపును పాటిస్తూ సమాజంలో ఆదర్శంగా ఎదగాలని ఆకాంక్షించారు.మరో ముఖ్య అతిథి రవీంద్ర బాబు మాట్లాడుతూ మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ వారికి ఇచ్చిన మాట ప్రకారం పేపర్ ప్లేట్ యంత్రానికి సమకూర్చడం జరిగిందన్నారు. దీనిని లబ్ధిదారులు చక్కగా ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రజని, సభ్యులను ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక సర్పంచ్ తిరుకోటి సుజాత, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలిక సుబ్రహ్మణ్యం శర్మ (దత్తుడు), స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

18 నుంచి పాళమ్మ జాతర

ప్రజాశక్తి- మామిడికుదురు

ఈదరాడ గ్రామ దేవత శ్రీ పాళమ్మ అమ్మవారి జాతర ఈనెల 18 నుంచి 21 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సాధనాల సుబ్బారావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 18న సాయంత్రం అమ్మవారి జాతర నిర్వహిస్తారన్నారు. 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 21న నైవైద్యాలు సమర్పిస్తారన్నారు. తీర్థ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జాతర మహోత్సవాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలు ఆదివారం అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆవిష్కరించారు.

ఘనంగా సీతారామ కల్యాణం

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలో ఆదివారం సీతారామ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.

ఆత్రేయపురం: మండలం లోని బొబ్బర్లంక గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలో కపిలేశ్వరపురం, అంగర, వల్లూరు, తాతపూడి, వెదురుమూడి, మాచర, కాలేరు, నేలటూరు, కోరుమిల్లి, కేదార్ లంక తదితర గ్రామాల్లో సీతారామకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. **ఆలమూరు:** మండలంలోని మడికి శివారు చిలకలపాడులో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకలలో రామాలయం వద్ద అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు.